

మోతీ మాత జాతర ప్రారంభం

గిరిజనుల ఆరాధ్య దైవంగా నిత్య పూజలందుకుంటున్న మరిగమ్మ మోతీ మాత జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. 8లో..



కదిలించిన కథనం

హార్టీసెట్‌లో స్టేట్ 3 ర్యాంకర్ స్రవంతి చదువుకు మానవతావాదులు అండగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. 8లో..



'డబుల్' జాబితాపై గందరగోళం

డబుల్ ఇళ్ల సర్వేలో అధికారులు విడుదల చేసిన లబ్ధిదారుల అర్హత జాబితాపై గందరగోళం నెలకొంది. అధికారుల సర్వే తీరుపై సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు. 9లో..

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ సంజీవ్‌కుమార్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డైరెక్టర్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా(వాషింగ్టన్ డీసీ)కి చెందిన డాక్టర్ గజ్జెల సంజీవ్‌కుమార్ సూచించారు. శిలాజ ఇంధనాల వాడకం వల్ల కలిగే నష్టాలు, గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాలపై గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, బాలుర డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు వేర్వేరుగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో విద్యార్థులకు జీవ ఇంధనాలపై శాస్త్రీయ పద్ధతిలో పరిశోధన చేయడం, ఇంధనాల సేకరణ, పేటెంట్ తీసుకునే విధానాలపై సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్స్ డాక్టర్ పీవీ ఉమాశశి, డాక్టర్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి పాత్రల యూనిట్ ఏర్పాటుపై మంత్రితో చర్చ



మంత్రితో చర్చిస్తున్న విఫిన్‌కుమార్

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణంలోని కేసీఆర్ నగర్ శివారులో కుమ్మరుల (శాలివాహన) కోసం రెండు ఎకరాల్లో నిర్మించనున్న మట్టి పాత్రల తయారీ యూనిట్ గుర్చి గురువారం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రతినిధి విఫిన్ కుమార్ మంత్రి హరీశ్‌రావును కలిశారు. క్యాంప్ కార్యాలయంలో ఉత్తరప్రదేశ్‌లోని సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విఫిన్ కుమార్ పరిశ్రమ ఏర్పాటు గుర్చి మంత్రితో చర్చించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. రెండు రోజులపాటు ఇక్కడి శాలివాహన జీవన అంశాలపై అధ్యాయనం చేసి ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



మేళాను పరిశీలిస్తున్న రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. గురువారం చిన్నకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు చదువును సులువుగా అభ్యసించేందుకు ఈ మేళాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు సులవైన పద్ధతిలో బోధించే పరికరాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఎంఈఓ దేశిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ సాగునీటి కాలువ పక్కన ఉన్న రోడ్డు భూములను ఆక్రమించే వారిపై కేసులు పెడతామంటూ ఇరిగేషన్ శాఖ డీఈఈ శ్యాం హెచ్చరించారు. మండల పరిధిలోని బందారం, అంకిరెడ్డిపల్లి, తాడూర్ శివారుల్లో సాగు నీటి కాల్వను గురువారం ఇరిగేషన్ శాఖ జేఈ రాజశేఖర్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు గోనె శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యాం మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ 3 కెనల్‌కు ఉన్న రెండు వైపుల ఉన్న రోడ్డును అక్కడక్కడ రైతులు ఆక్రమించుకొని వ్యవసాయ పనులకు ఉపయోగించుకోవడం నేరమన్నారు. కాల్వలో మట్టి పేరుకుపోవడంతో పాటు కాల్వ కోతకు గురైనట్లు గుర్తించామన్నారు. మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామన్నారు.

మల్లన్న.. నీవే చూడన్న!

- కొమురవెల్లి ఆలయ ఉద్యోగుల మధ్య వార్
- ఒకరిపై ఒకరు రాతపూర్వక ఫిర్యాదులు
- గతంలో కోటయ్య పేరుతో కంప్లైంట్
- ఏడాది కాలంగా సాగుతున్న గొడవ
- పాలకమండలి సమావేశంలో చర్చించే అవకాశం



కొమురవెల్లి మల్లికార్జున దేవాలయం వద్ద భక్తుల సందడి(ఫైల్)

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో పని చేస్తున్న ఉద్యోగుల మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. దీంతో దేవాదాయ శాఖకు ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. భక్తుల కోరిన కోర్కెలను తీర్చే మల్లన్న, ప్రజలకు మానసిక ప్రశాంతతను, భక్తి భావం పెంపొందించే మల్లన్న ఆలయంలో పని చేసే ఉద్యోగులు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడంతో జిల్లా వ్యాప్తంగా చర్చ సాగుతోంది. వీరి తీరుతో భక్తి శ్రద్ధలతో వచ్చే భక్తులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో 11వ తేదీన జరిగే పాలకమండలి సమావేశంలో చర్చించే అజెండాలో ప్రధానంగా ఫిర్యాదుల అంశాన్ని చేర్చినట్లు తెలిసింది.

- దేవాలయంలో ద్వితీయ కీలక అధికారి సరైన విద్యార్హతలు లేకుండా తప్పుడు ధ్రువపత్రాలతో విధులు నిర్వర్తిస్తున్నారని, దీనికితోడు ఉద్యోగులను వేధిస్తున్నాడని 2022 నవంబర్1వ తేదీన ఆలయంలో పని చేస్తున్న ఓ విభాగానికి చెందిన ఉద్యోగి రాతపూర్వకంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, మంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.
- అంతకు ముందు ఈ ఫిర్యాదు చేసిన ఉద్యోగిపైన సరైన విద్యార్హతలు లేకుండానే విధులు నిర్వర్తిస్తున్నారని మరో ఉద్యోగి అక్టోబర్ 16, 2022న పాలక మండలికి ఫిర్యాదు చేశారు.
- వివిధ హోదాల్లో పని చేసే ఉద్యోగుల ఇంటి పేర్లు వేరైనా.. ఆ ఇద్దరి పేర్లు మాత్రం ఒక్కటే. ఆ ఇద్దరిపై ఫిర్యాదులు రావడం గమనార్హం.
- ఆ ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరిపై అవినీతి ఆరోపణలు, మరొకరిపై వయసు ధ్రువీకరణలో తప్పులు ఉన్నాయని గతంలో దేవాదాయ శాఖ సస్పెండ్ చేస్తే ఆ ఇద్దరు కోర్టుకు వెళ్లి స్టేతో తిరిగి విధుల్లో కొనసాగుతున్నారు. జాతర జరిగే సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాల్సిన ఆలయ సిబ్బంది ఇలా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంపై ముమ్మరంగా చర్చసాగుతోంది.
- గతేడాది కాలంగా కోటయ్య, ఆకాశ రామన్నల పేరుతో ఉద్యోగులు ఒకరిపై మరొకరు ఫిర్యాదుల పరంపర కొనసాగుతుంది. కొన్ని సంవత్సరాలుగా ఒకే దగ్గర విధులు నిర్వర్తిస్తుండటంతో ఒకరిపై మరొకరికి విభేదాలు వస్తుండటంతోనే ఈ ఫిర్యాదు చేసుకుంటున్నట్లు సమాచారం.
- 11వ తేదీన జరిగే పాలక మండలి సమావేశంలో చర్చించాల్సిన 15 అంశాల్లో మొదటి రెండు అంశాలుగా ఈ ఫిర్యాదులను చేర్చారు.
- ఈ సమావేశంలో పాలకమండలిలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుని ఉన్నత అధికారులకు ఏమని లేఖ రాస్తారో వేచిచూడాలి. ఏదేమైనా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

సమావేశంలో చర్చించి..

దేవాలయంలో పని చేసే ఇద్దరు ఉద్యోగులపై ఫిర్యాదులు వచ్చాయి. ఇలా ఇద్దరూ పరస్పర ఫిర్యాదులు చేసుకుంటుండటంతో ఇబ్బందులు తలెత్తే అకకాశం ఉంటుంది. అందుచేత ఈ నెల 11న జరిగే పాలక మండలి సమావేశంలో చర్చించి కమిషనర్‌కు నివేదిక పంపిస్తాం.

–గీస భిక్షపతి, చైర్మన్, కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం



పోలీస్, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

పోలీసుల ఆరోగ్య రక్షణకు కృషి

- ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చు
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- 'హెల్త్‌ప్రొఫైల్ ఆరోగ్య రక్ష' స్నేహిత సెంటర్ ప్రారంభం

సిద్దిపేటకమాన్: పోలీసులకు ఆరోగ్య రక్షణ కల్పించడానికి హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. గురువారం సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో 'స్నేహిత' మహిళా సహకార కేంద్రం, 'పోలీసుల హెల్త్‌ప్రొఫైల్ ఆరోగ్య రక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు సీపీ శ్వేత, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పోలీసుల హెల్త్ ప్రొఫైల్ ఏర్పాటుకు సిద్దిపేట జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. పోలీస్, పొలిటీషియన్, ప్రెస్ వీరందరి పరిస్థితి ఒకేలాగా ఉంటుందని, రాత్రి పగలు, పండగ సెలవులు లేకుండా పని చేస్తారన్నారు. హెల్త్‌ప్రొఫైల్ కార్యక్రమం రెండేళ్లలో, మూడు దశల్లో నిర్వహిస్తామన్నారు. ప్రొఫైల్ రిపోర్ట్‌లు ఇచ్చే సమయంలో వారి జీవిత భాగస్వామితో కలిపి కూర్చోబెట్టి కౌన్సెలింగ్ ఇచ్చి ఇవ్వాలన్నారు. రక్షక భటులకు ఆరోగ్య రక్ష కార్యక్రమానికి రూ.15 లక్షల బడ్జెట్ కేటాయించామన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి అవసరమైన వారికి మందులు, అందజేసి సలహాలు సూచనలు ఇస్తారన్నారు. పోలీస్ ఆరోగ్య రక్ష కార్యక్రమం త్వరలోనే మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ప్రారంభిస్తామని మంత్రి వివరించారు.



పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, సీపీ శ్వేత

ప్రత్యేక కృతజ్ఞతలు: సీపీ శ్వేత

అంతకుముందు సీపీ ఎన్.శ్వేత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మంత్రి హరీశ్‌రావు జిల్లా పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణ గురించి పోలీస్ ఆరోగ్యరక్ష అనే ఒక పైలెట్ ప్రాజెక్టును తీసుకొని నిర్వహిస్తున్నామన్నారు. ఇంత మంచి ప్రాజెక్టు చేపట్టినందుకు పోలీసుశాఖ తరఫున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ విమల థామస్ మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. పోలీసుల ఆరోగ్యానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నూతనంగా ఆధునికరించిన సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను మంత్రి ప్రారంభిచారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, ఆర్ఐలు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, సుడా డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం, కౌన్సిలర్ సాయి, సీఐలు భిక్షపతి, రవికుమార్, ఎస్ఐలు శ్రీధర్‌గౌడ్, రాజేష్, నర్సింహ్మా, స్వచ్ఛంద సంస్థ సీఈవో శివకుమారి, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్, హుస్నాబాద్‌కు 'ఓడీఎఫ్ ప్లస్'



సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యాధర్



సర్టిఫికెట్ అందుకుంటున్న రాజమల్లయ్య, పక్కన అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సర్టిఫికెట్ అందుకున్న మున్సిపల్ కమిషనర్లు

గజ్వేల్/హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం పట్టణాలను ఓడీఎఫ్ (బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత)గా మార్చడానికి నిర్వహించిన పోటీల్లో గజ్వేల్– ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్ మున్సిపాలిటీలకు ఓడీఎఫ్ ప్లస్ సర్టిఫికెట్ దక్కింది. ఇటీవల కేంద్రం బృందం ఈ ప్రాంతాల్లో పర్యటించి పబ్లిక్ టాయిలెట్లలో సదుపాయాలు, నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించింది. అలాగే ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. ఈ క్రమంలోనే ఈ రెండు పట్టణాలకు 2022–23 ఏడాదికిగానూ ఓడీఎఫ్ సర్టిఫికెట్ దక్కంది. కాగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి వర్క్‌షాపులో ఈ అవార్డును అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, గజ్వేల్, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, రాజమల్లయ్య పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ సర్టిఫికెట్ దక్కడం హర్షణీయమన్నారు. పాలకవర్గం, అధికారులు, పట్టణ ప్రజల సహకారంతోనే ఈ సర్టిఫికెట్ సాధ్యమైందన్నారు. ఇదే స్ఫూర్తితో పట్టణంలో మరింత మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తామని తెలిపారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు

పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

సిద్దిపేటకమాన్: జనవరి 12న జాతీయ యూత్ డే (స్వామి వివేకానంద జయంతి) సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని యువతీ యువకులకు ఈ క్రీడోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాలీబాల్, కబడ్డీ, చెస్, అథ్లెటిక్స్, 100, 800 మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్, మహిళలకు 100 మీటర్స్, 400 మీటర్స్, లాంగ్ జంప్, షాట్ పుట్, చెస్, వాలీబాల్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 18 –29 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. 01 ఫిబ్రవరి 1994 నుంచి 31 జనవరి 2005 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఈ క్రీడలను గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ పక్కన ఉన్న గ్రౌండ్, హుస్నాబాద్ మినీ స్టేడియంలో, అథ్లెటిక్స్ 100, 400, 800, మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్‌లను సిద్దిపేట పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక వ్యక్తి రెండు ఈవెంట్స్‌లో మాత్రమే పాల్గొనాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో 8వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలి'

సిద్దిపేటఎడ్యుకేషన్: సెంటర్ ఫర్ సెల్యులార్, మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) హైదరాబాద్ అటల్ ఇంకుబేషన్ సెంటర్ బృందం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలను గురువారం సందర్శించింది. డాక్టర్ రాంజీ నేతృత్వంలో డాక్టర్ రితికతో పాటు పలువురు శాస్త్రవేత్తలు కళాశాలలోని లైఫ్‌సైన్స్ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పరిశోధన, ఆవిష్కరణలవైపు విద్యార్థులు దృష్టిసారించాలని సూచించారు. వినూత్న ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు రూ.5లక్షల నగదు బహుమతి, స్టార్టప్‌ల కోసం రూ. 20లక్షల పెట్టుబడని అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని నిర్వహించిన జువాలజీ, బాటనీ, బయోటెక్నాలజీ విభాగాల అధ్యాపకులను ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అభినందించారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ పి. అయోధ్యారెడ్డి కళాశాల వసుతులు, ప్రత్యేకతలను గూర్చి సీసీఎంబీ బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మదన్‌మోహన్, అధ్యాపకులు డాక్టర్ శైలజ, డాక్టర్ కె. రాణి, ఫాతిమా, విశ్వనాథం, డాక్టర మధుసూదన్‌రెడ్డి, డాక్టర పుణ్యమ్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సీసీఎంబీ బృందంతో విద్యార్థులు, అధ్యాపకులు

అర్చక పరీక్షలకు నాచారం గుట్ట సిద్ధం

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలోని వర్గల్ మండలం నాచారంగుట్ట అర్చక పరీక్షల నిర్వహణకు సర్వసన్నద్ధమైంది. శుక్ర, శనివారాల్లో రెండు రోజులు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకోసం గురువారం జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కట్టా సుధాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శివరాజు నాచారం గుట్టలోని టీటీడీ కల్యాణ మండపం, ఆలయ వ్రతమండపం పరీక్ష కేంద్రాలు పరిశీలించారు. వారి సూచనలకు అనుగుణంగా సిబ్బంది ఏర్పాట్లు పూర్తిచేశారు. కేంద్రాలలో పరీక్ష రాసే అభ్యర్థుల కోసం టేబుల్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్ నెంబర్లు వేశారు. కేంద్రానికి ఒకరు చొప్పున నోడల్ అధికారులుగా సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శివరాజు, ఇన్విజిలేషన్ తదితరాల కోసం మరో 48 మంది సిబ్బంది నియమితులయ్యారు. అర్చక పరీక్షల కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని సుధాకర్‌రెడ్డి తెలిపారు. 452 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగేలా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చే అభ్యర్థులకు భోజన, బస వసతులను తూప్రాన్‌కు చెందిన సలాక రాజేశ్వరశర్మ, ఆత్రేయశర్మలు సమకూర్చుతున్నట్లు పేర్కొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సుధాకర్‌రెడ్డి

దుబ్బాకలో పీజీ కళాశాల ఏర్పాటు చేస్తాం




మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ పీజీ కళశాల ఏర్పాటు చేస్తామని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక పాఠశాలలో జరిగిన టీఎల్ఎం మేళాలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆయన బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో పీజీ కళశాల లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి ఏర్పాటు చేయించేలా కృషి చేస్తానన్నారు. హబ్షీపూర్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులానికి మంత్రి హరీశ్‌రావు రూ.50 లక్షల నిధులు అందజేశారని కలెక్టర్ సైతం గురుకులాన్ని సైతం సందర్శించరన్నారు. నూతన భవనంలో ఉన్నత పాఠశాల, జూనియర్ కళశాల తరగతులు కొనసాగుతున్నాయని డిగ్రీ తరగతులు సైతం ఈ భవనంలోనే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, భాస్కరచారి, చింతల జ్యోతి, శేర్ల కైలాసం, పద్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన ఓటర్లు

- కొత్తగా 17,424 మంది నమోదు
- జిల్లాలో 2,226 ఓట్ల తొలగింపు
- మొత్తం ఓటర్లు 8.86 లక్షలు
- మహిళలు 4,46,345.. పురుషులు 4,40,192.



సాక్షి, సిద్దిపేట: జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగింది. గురువారం జిల్లా అధికారులు ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. ఇటీవల కొత్త ఓటర్ల నమోదు, సవరణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తుది జాబితాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 8,86,560 మంది ఓటర్లు ఉన్నారు. గతేడాది నవంబర్ 9న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 8,71,362 మంది ఉండగా..గతం కంటే ఈ సారి 15,198 మంది ఓటర్లు పెరిగారు.

మహిళలే అధికం

జిల్లా వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారుల ద్వారా కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. నాలుగు నియోజకవర్గాల్లో 17,424 మంది కొత్త ఓటర్లు నమోదు చేసుకోగా 2,226 ఓట్లను తొలగించారు. జిల్లాలో మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 8,86,560 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 4,40,192, మహిళలు 4,46,345, థర్డ్ జండర్ 23 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 6,153 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పురుషులు, మహిళలు, థర్డ్ జండర్ కలుపుకుని గజ్వేల్ నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా ఓటర్లు దుబ్బాక నియోజకవర్గంలో ఉన్నారు.

అర్హులు నమోదు చేసుకోవాలి

2023, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఫాం–6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్, తహసీల్దార్, బూత్ స్థాయి అధికారులకు దరఖాస్తులను అందజేయాలి. ఓటర్ల సవరణ, సవరణకు ఫాం–8, ఆక్షేపణలు, తొలగింపునకు ఫాం –7ను సమర్పించాలి. ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలి.

–ప్రశాంత్ జీవన్ పాటిల్, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

మొత్తం ఓటర్ల వివరాలు:

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
హుస్నాబాద్	1,13,006	1,14,218	03	2,27,227
సిద్దిపేట	1,08,820	1,09,938	12	2,18,770
దుబ్బాక	92,517	95,375	0	1,87,892
గజ్వేల్	1,25,849	1,26,814	08	2,52,671
మొత్తం	4,40,192	4,46,345	23	8,86,560

కొత్త ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	కొత్తగా నమోదు	తొలగింపు
హుస్నాబాద్	4,175	206
సిద్దిపేట	4,012	521
దుబ్బాక	3,332	1,035
గజ్వేల్	5,905	464

క్లుప్తంగా

రేషన్ బియ్యం కొన్నా, అమ్మినా నేరమే



నర్సాపూర్‌లోని గోదాంలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు

నర్సాపూర్: ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా నేరమేనని టాస్క్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు హెచ్చరించారు. ఆయన తన బృందంతో గురువారం ప్రభుత్వ సివిల్ సప్లయి గోదాంతో పాటు మండలంలోని నాల్గు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు బియ్యం రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తోందన్నారు. మండలంలోని నాలుగు రైసుమిల్లుల్లో తనిఖీ చేశారు. గోదాం, రైసుమిల్లులలో తనిఖీ చేసినపుడు ద్రోణాచార్యులు వెంట ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, తహసీల్దార్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

మంజీరా తీర ప్రజలను భయపెడుతున్న మొసళ్లు



నదీ ఒడ్డున సేద తీరుతున్న మొసలి (సర్కిల్లో)

కొల్చారం(నర్సాపూర్): మంజీరా తీరా ప్రాంత ప్రజలను నదిలోని మొసళ్లు తరచూ భయపెడుతున్నాయి. గురువారం మండల పరిధిలోని తుక్కాపూర్ నదీ తీరంలో మొసలి కనబడటంతో పశువుల కాపరులు భయాందోళన చెందారు. మండల పరిధిలో పది గ్రామాల వెంట మంజీరా నది ప్రవహిస్తుంది. ఎగువ నుంచి ప్రవాహంలో కొట్టుకు వచ్చిన మొసలి పిల్లలు పెరిగి పెద్దవైనట్లుగా తీర ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. రెండు నెలల క్రితం తుక్కాపూర్ గ్రామపంచాయతీ సమీపంలోని నీటి గుంతలో మొసలి కనిపించింది. గొర్రెలు, మేకలను నదీతీరంలోకి తీసుకెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళ, బుధ వారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో 13 మంది పట్టుబడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో గురువారం హాజరు పరచగా జడ్జి 11 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు, మరో ఇద్దరికి రూ.3 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

సుభాష్‌కు అచార్యదేవోభవ అవార్డు



అవార్డు అందుకుంటున్న సుభాష్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని నేతాజీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపాలపురం సుభాష్ ఆచార్య దేవోభవ అవార్డు వరించింది. బ్రెయిన్ ఫీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హైటెక్ సిటీలో బుధవారం రాత్రి నిర్వహించిన జాతీయ స్థాయి అవార్డుల పంపిణీ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ట్రస్మా జాతీయ అధ్యక్షులు కులభూషణ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శేఖర్‌రావు, మధుసూదన్, పరంజ్యోతి, బ్రెయిన్‌ఫీడ్ చీఫ్ ఎడిటర్ బ్రహ్మం తదితరులు అభినందించారు.

వైభవంగా మోతీ మాత జాతర

- జాతరలో భక్త జన సందోహం
- తరలివచ్చిన మూడు రాష్ట్రాల భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

జహీరాబాద్ టౌన్: గిరిజనుల ఆరాధ్య దైవంగా నిత్య పూజలందుకుంటున్న మరిగమ్మ మోతీ మాత జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. మినీ మేడారంగా పిలిచే జాతరకు తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీ గా గిరిజన పుత్రులు తరలివచ్చారు. దీంతో పరిసరాలు జనంతో కిటికటలాడింది. మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండాల నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండా ప్రాంతంలో శ్రీమరిగమ్మ మోతీ మాత మందిరం ఉంది. కోరిన కోరికలను అమ్మ తీరుస్తుందని అడవి పుత్రుల నమ్మకం. ఏటా రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తుంటారు. ఈ సారి ప్రారంభమైన జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మొదటి రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మందిరం వద్ద జెండాను ఆవిష్కరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవైద్యం సమర్పించారు. సాంప్రదాయ పద్ధతిలో యజ్ఞం నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోగల 54 తండాల బంజారాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్జున్ నాయక్, జాడిమల్కాపూర్, రాయిపల్లి తదితర తండాల విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వహకులు వారికి బహుమతులను అందచేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తల కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. మోతీ మాత జాతరకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ అటవీ పరిసర ప్రాంతం కిక్కిరిసిపోయింది. వాహనాల పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు టెంట్లు వేసుకున్నారు. అన్ని శాఖల అధికారులు అక్కడే ఉండి భక్తులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకున్నారు. తాత్కాలిక మరుగు దొడ్లు నిర్మించారు. తాగునీరు, కరెంట్ సౌకర్యం కూడా కల్పించారు. జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.



మరిగమ్మ మోతీ మాత

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



లాలు (ఫైల్)

దుబ్బాక: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం కొత్త పల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కార్నల లాలు(40) పంటలు సాగు చేస్తున్నాడు. తనకున్న రెండు ఎకరాలల్లో వానాకాలం సీజన్‌లో వరి వేశాడు. చెరువు నిండటంతో పంట నీటి మునిగింది. గతంలో బతుకు దెరువు కోసం ఆటో ఇతర వాహనాలను కొన్నాడు. వాటిని విక్రయించి నష్టపోయాడు. మొత్తం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని ఇంట్లో చెప్పలేక తరుచూ మదన పడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం అర్ధరాత్రి ఇంటి వెనుక వేప చెట్టుకి ఉరి వేసుకున్నాడు. భర్త కనబడకపోవడంతో భార్య శ్యామల వెతుకుతుండగా ఇంటి వెనుక చెట్టుకు ఉరివేసేకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతుదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తరచు కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పట్టించుకోని అధికారులు



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న బాధిత రైతులు

గజ్వేల్‌రూరల్: వ్యవసాయ బోరుబావుల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అదనపు భారం పడుతుండటంతో అది తరచు కాలిపోతుందని, అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వాపోయారు. గజ్వేల్ మండలం బెజుగామ, ఆరెపల్లి(ఎస్‌బీ) గ్రామాలకు చెందిన 13 మంది రైతులు వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ కోసం డీడీలు చెల్లించి గతంలో ప్రత్యేకంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను తెచ్చుకున్నామని తెలిపారు. ఇటీవల కొందరు రైతులు ఇదే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుబావులకు కనెక్షన్ ఇవ్వడం వల్ల తరచూ కాలిపోయి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇదే విషయమై సంబంధిత విద్యుత్‌శాఖ ఏఈకి ఫిర్యాదు చేసినప్పటికీ నామమాత్రంగా చర్యలు తీసుకుని వదిలి వేస్తున్నారని మండిపడ్డారు. తమ బోరుబావుల కోసం 13 మంది రైతులంతా కలిసి ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను పొందినప్పటికీ అదనంగా మరో తొమ్మిది మంది ఇదే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను వినియోగిస్తుండడంతో అదనపు భారంతో ట్రాన్స్‌ఫార్మర్ 15 రోజులకోసారి కాలిపోతుందని, దీంతో తాము పంట నష్టపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము అవస్థలు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అగ్నిప్రమాదంలో మూడు దుకాణాలు దగ్ధం

- అప్రమత్తం చేసిన బ్లూకోట్ సిబ్బంది
- ఇద్దరికి తప్పిన ప్రాణాపాయం



కాలిపోతున్న దుకాణాలు

సిద్దిపేటకమాన్: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని రోడ్డుపక్కన ఉన్న మూడు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం హుస్నెపాలియా బాయిలూర్‌కు చెందిన బసవన్న గత 12 సంవత్సరాలుగా సిద్దిపేట పట్టణం మెదక్ రోడ్డులో రిలయన్స్ మార్ట్ పక్కన దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. శీతాకాల ఉన్ని దుస్తులు విక్రయాస్తూ భారత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి బసవన్న షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. షాపులో మహేశ్, మహాదేవ్ నిద్రించారు. గురువారం తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో ఆ రూట్‌లో బ్లూకోట్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది దుకాణం నుంచి మంటలు, పొగలు రావడాన్ని గమనించారు. వెంటనే దుకాణానికి వెళ్లి లోపల ఉన్న ఇద్దరిని అప్రమత్తం చేయడంతో బయటకు వచ్చారు. వారు వెంటనే యజమానికి సమాచారం ఇచ్చారు. అతడు వచ్చేసరికి అతడి దుకాణంతో పాటు, పక్కన ఉన్న సిద్దిరాజ్ దుకాణం దగ్ధమయ్యాయి. వీటితోపాటు షఫీకి చెందిన పండ్ల దుకాణం కూడా కాలిపోయింది. పానిపూరీ బండికి కూడా మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. సుమారు రూ.8 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చలికాచుకోవడం కోసం మంట పెట్టుకుని ఆ మంటలను ఆర్పకుండా వెళ్లిపోవడంతో దుకాణాలు కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు కాలిపోయిన దుకాణాలను పరిశీలించి ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి



ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి చేస్తున్న గిరిజనులు

కల్హేర్(నారాయణఖేడ్): అటవీ భూమి కబ్జా చేశారని తెలియడంతో అడ్డుకునేందుకు వెళ్లిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై గిరిజనులు దాడి చేశారు. నిజాంపేట మండలం మునిగేపల్లి నాన్యనాయక్ తండాలో జరిగిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 415లో హరితహారం కింద అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు. సంబంధిత భూమి కబ్జా చేస్తున్నారని నారాయణఖేడ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. తండాకు చెందిన కాట్రోత్ సక్రియనాయక్, అతని భార్య కేస్లిబాయి, కొడుకు జైపాల్ కలిసి బీట్ ఆఫీసర్ రాములుపై దాడి చేశారు. బీట్ ఆఫీసర్ రాములు తమను ఇబ్బంది పెడుతున్నాడని గిరిజనులు ఆరోపించారు. రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఎదుటే వారు దాడి చేశారు. కల్హేర్ ఎస్ఐ ప్రశాంత్, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఘటనపై విచారణ చేశారు. దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. దాడి వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.

నేరస్తుడికి ఆరేళ్ల జైలు

రూ.15 వేల జరిమానా

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలో మూడేళ్ల క్రితం తుపాకీ పేలి కలకలం రేపిన సంఘటనలో కోర్టు నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా విధించింది. హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శ్వేతరెడ్డి వాదనలు విన్న తర్వాత నేరస్తుడు దేవుని సదానందంకు ఆరేళ్ల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. నేరస్తుడికి శిక్ష పడేలా సహకరించిన కోర్టు కానిస్టేబుల్ వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుల్స్ శివప్రసాద్, రాజమల్లు, ఏఎస్ఐ స్వామిదాసును అభినందించారు. వీరికి త్వరలో రివార్డు ఇవ్వనున్నట్లు సీఐ వెల్లడించారు.

బైక్ ఢీ: వ్యక్తి మృతి



హరికృష్ణ (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): మోటర్ సైకిల్ ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పాలమాకులలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలమాకులకు చెందిన ఓ మహిళ మరణించడంతో రాత్రి దశ దిన కర్మ కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులోని కాల్వ వద్ద మైల తీసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కవ్వం అనిల్‌రెడ్డి బైక్‌ను వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఏటి హరికృష్ణ (36) తోపాటు గుండెల్లి ఎల్లయ్యను ఢీ కొట్టాడు. దీంతో హరికృష్ణ అక్కడికక్కడే మరణించగా ఎల్లయ్యకు గాయాలయ్యాయి. మృతుడి బావ దర్శనం యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



రమేశ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): గజ్వేల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి ఆచూకీ తెలియకుండాపోయింది. గౌరారం ఎస్సై సంపత్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ మండలం చౌదరిపల్లికి బోండ్ల రమేశ్(28) టాటా ఏస్ వాహన డ్రైవర్. బుధవారం సాయంత్రం గజ్వేల్‌కు వెళ్తున్నట్లు ఇంటిలో చెప్పి వెళ్లి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు అతడి కోసం బంధువులను, తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. గురువారం రమేశ్ భార్య ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే గౌరారం ఎస్ఐ ఫోన్ 94409 01839కు సమాచారమివ్వాలన్నారు.

బోరు మోటార్ చోరీ

నర్సాపూర్‌రూరల్: వ్యవసాయ పొలంలోని బోరుమోటరు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని రూప్లతండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన రైతు లాలుకు సంబంధించిన బోరు మోటర్ స్టార్టర్ డబ్బాను గుర్తు తెలియని దొంగలు బుధవారం రాత్రి ఎత్తుకెళ్లారు.

వ్యక్తి ఆత్మహత్య

కేసు నమోదు

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన దబ్బెట రమేశ్ వృత్తిరీత్యా డ్రైవర్. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తితో గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కదిలించిన చదువుల తల్లి కథనం



చెక్కును అందిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సాక్షి ఎఫెక్ట్..

- హార్టీసెట్‌లో స్టేట్ 3వ ర్యాంక్ సాధించిన స్రవంతి
- ఫీజు చెల్లించలేక తండ్రితోపాటు గొర్రెలను కాస్తున్న వైనం
- సాక్షి కథనానికి స్పందించిన దాతలు
- రూ.3.44 లక్షల చెక్కు అందించిన జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్

దుబ్బాకటౌన్: హార్టీ సెట్‌లో స్టేట్ 3 వర్యాంక్ సాధించింది. బీఎస్సీ హార్టీకల్చర్‌లో సీటు వచ్చినా రూ.5 లక్షల ఫీజు చెల్లించే స్తోమత లేక తండ్రితో పాటు మేకలు కాస్తోంది. డిసెంబర్ 4న సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం కోనాయిపల్లికి చెందిన గొల్లచిన్నోల్ల స్రవంతి దయనీయమైన పరిస్థితిని సాక్షి వెలుగులోకి తెచ్చింది. సాక్షి కథనంతో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తో పాటు మానవతావాదులు చలించి ఆమె చదువుకు అండగా ఉంటామని ముందుకు రావడం తెల్సిందే. కౌన్సిలింగ్‌లో ఫీజు కట్టేందుకు రూ.50 వేలు ఎంపీ గతనెల 5న స్రవంతి ఇంటికి వెళ్లి అందజేశారు.

కలెక్టర్ చేతుల మీదుగా ..

స్రవంతి ఉన్నత చదువుకు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ముందుకొచ్చింది. గురువారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ చేతుల మీదుగా రూ.3.44 లక్షల చెక్కును అందజేసింది. చేయూతనందించిన రైస్‌మిల్లర్స్ అసోసియోషన్ సభ్యులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. స్రవంతి రైస్మిల్లర్స్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా గర్వపడేలా ఉన్నతశిఖరాలకు చేరుకోవాలి

హార్టీసెట్‌లో స్టేట్ 3 వ ర్యాంక్ సాధించిన స్రవంతిని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రులు, జిల్లా గర్వపడేల ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి హరీశ్, రైస్‌మిల్లర్స్ అసోసియోషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్,సెక్రటరీ బుచ్చయ్య, నాయకులు చింత రాజు, ప్రభాకర్, బాలకిరణ్‌రావు, శివకుమార్, కాశీనాథ్, రమేశ్, రాజేష్, రవిప్రకాశ్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: క్రీడాపోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం అంతర్‌జిల్లా పాలిటెక్నిక్ ప్రభుత్వ, ప్రైవేటు, అనుబంధ కళాశాలకు చెందిన క్రీడాకారులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి వారు క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ములుగు సమీపంలో అధునాత సౌకర్యాలతో విశాలమైన క్రీడా మైదానాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా జరిగిన అంతర్‌జిల్లా కీడాపోటీల్లో బాలికల విభాగంలో సిద్దిపేట, మేడ్చల్, చేగుంట(ప్రభుత్వ పాలిటెక్నిక్), ఇందూర్ ఇన్‌స్టిట్యూట్(పాలిటెక్నిక్), హోలిమేరి పాలిటెక్నిక్ కళాశాల మేడ్చల్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొనగా... బాలుర విభాగంలో జీఎంఆర్‌పీ గజ్వేల్‌తో పాటు సిద్దిపేట, యాదగిరిగుట్ట, చేర్యాల, చేగుంట, మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ఇందూర్ ఇన్‌స్టిట్యూట్(పాలిటెక్నిక్), హోలిమేరి పాలిటెక్నిక్ కళాశాల మేడ్చల్‌ల నుంచి వచ్చిన సుమారు 600 మంది క్రీడాకారులు రెండ్రోజుల పాటు జరుగనున్న పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్యామల, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీర, టెన్నిస్‌వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హైదర్‌పటేల్, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మాజీ మంత్రి బాబూమోహన్

జోగిపేట(అందోల్): బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని అందోల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బాబూమోహన్ అన్నారు. గురువారం అందోల్ రామాలయంలో అందోల్ నియోజకవర్గ పాలక్ తుల ఆధ్వర్యంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్థాగతంగా బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఈనెల 7న పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్ సమావేశం ద్వారా బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. సమావేశానికి బూత్ కమిటీ అధ్యక్షులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, జిల్లా సహ ఇన్‌చార్జి రామకృష్ణ, విస్తారక్ మహేశ్ జీ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ పాకల తొలగింపు



గూడెంలో అక్రమంగా వేసిన పశువుల పాకలను తొలిగిస్తున్న అధికారులు

ఏడెకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం శివారు 361 సర్వే నంబర్‌లో అక్రమంగా వేసిన పశువుల పాకలను గురువారం అధికారులు తొలిగించారు.. సుమారు ఏడు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూమి లేకపోవడంతో గ్రామంలో పల్లెప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, జిమ్ వంటివి అమలు చేయలేకపోతున్నట్లు గతంలో సర్పంచ్ దేవ రాజశ్రీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమంగా వేసిన పాకలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీడీఓ రాము, ఎస్ఐ నరేశ్‌రెడ్డి తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి జేసీబీతో తొలగించారు. గ్రామ అవసరాల కోసం ఈభూమిని వినియోగించుకోవచ్చని తహసిల్దార్ తెలిపారు.

చికెన్ సెంటర్ నిర్వాహకురాలిపై ..

- మున్సిపల్ సిబ్బంది దాడి
- పోలీసులకు ఫిర్యాదు
- దాడి అవాస్తవమన్న మున్సిపల్ కమిషనర్

తూప్రాన్: పట్టణ పరిధిలోని పోతరాజుపల్లిలో చికెన్ సెంటర్ నిర్వాహకురాలిపై మున్సిపల్ సిబ్బంది ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ పేరుతో దుకాణంలోకి చొరబడి దాడికి పాల్పడినట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు వినియోగంలో లేకుండా చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పోతరాజుపల్లిలో చికెన్ సెంటర్‌లో తనిఖీ కోసం వచ్చిన మున్సిపల్ సిబ్బంది కవర్లతో పాటు తూకం వేసే రెండు త్రాసులను తీసుకెళ్లారు. అడ్డుకునేందుకు యత్నించడంతో మున్సిపల్ మహిళా సిబ్బంది తనపై దాడి చేసిందని జగ్గన్నగారి భానుమతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సిబ్బంది దాడి అవాస్తవం

మున్సిపల్ పరిధిలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను నిర్మించింది. అందులోనే మాంసం, చేపలు, కూరగాయలు విక్రయించే విధంగా ఏర్పాట్లు చేశాం. పోతరాజుపల్లికి చెందిన జగ్గన్నగారి భానుమతి, భర్త జితేందర్‌రెడ్డి నిబంధనలు ఉల్లఘించి చికెన్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మినహా, ఇతర ప్రాంతాల్లో విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలోనే చికెన్ సెంటర్‌లో త్రాసులు బ్బంది తీసుకువచ్చారు. సిబ్బందిపై ఉద్దేశ పూర్వకంగానే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇకపై నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– మున్సిపల్ కమిషనర్